## మంచి వార్త

# గతకాలపు స్మృతులు... రచ్చకట్టలు



**ఒకప్పుడు** భారతీయ గ్రామాలు, నగరాల నడుమ రచ్చకట్టలు రాజసం ఒలకబోసేవి. ఓ పెద్దచెట్టు చుట్టూ నిర్మించిన వేదికలే రచ్చకట్టలు. సాధారణంగా ఇవి ఊరి మధ్యలో ఉంటాయి. అనాదిగా భారతదేశపు జనావాసాల సామాజిక, ధార్మిక, సాంస్కృతిక జీవనానికి చిరునామాగా నిలిచాయి. రావి, జువ్వి, వేప లాంటి భారీ వృక్షాల నీడన నిర్మించిన కట్టలు గ్రామస్థుల ముచ్చట్లకు, పంచాయితీ తీర్పులకు, బాటసారుల విశ్రాంతికి నెలవులు. అయితే, దేశవ్యాప్తంగా నగరీకరణ, పట్టణీకరణ వేగం పుంజుకున్నాయి. దీంతో ఒకప్పుడు కళకళలాడిన రచ్చకట్టలు, మామూలు కట్టలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు నగరంలో కూడా కట్టె(ట్ట)లది గత వైభవమే. దీంతో అలనాటి వైభవానికి ఆనవాళ్లుగా నిలిచిపోయిన కట్టలను సంరక్షించే చర్యలు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాచ్) నేతృత్వం వహిస్తున్నది. అరేబియా సముద్ర తీర ప్రాంత నగరం మంగళూరులో మొత్తం 250కి పైగా కట్టలను పునరుద్ధరించాలని నిర్ణయించుకున్నారు. కేవలం వీటిని పునరుద్ధరించడం, సంరక్షించడం మాత్రమే కాకుండా కట్టలను డాక్యుమెంటేషన్ కూడా చేస్తున్నారు. రోజురోజుకూ రోడ్లపై రద్దీ పెరుగుతుండటం వల్ల మధ్యలో ఉన్న చెట్లు, కట్టలను తొలగించాల్సి వస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో చెట్లు, రచ్చకట్టల పరిరక్షణకు ఇంటాచ్ ముందుకు రావడం సంతోషించాల్సిన విషయం. ఇక ఒకప్పుడు కట్టలను స్థానిక ప్రజలు తమ సొంతంగా భావించేవాళ్లు. ఏదైనా మరమ్మతు అవసరమైతే వాళ్లే స్వయంగా చేసేవారు. కాబట్టి, ఇప్పుడు కూడా కట్టలను బాగుచేసే విషయంలో, వాటిని భావి తరాలకు అందించే విషయంలో స్థానికులకు తగిన పాత్ర కల్పించాలి. కాగా, మంగళూరులో కట్టల గురించి తెలుసుకోవడానికి ఇంటాచ్ సంస్థ 'క్యూఆర్' కోడ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చింది. మంగళూరును ఆదర్శంగా తీసుకుని ఇతర ప్రాంతాల్లో కూడా స్థానిక ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ఘనమైన కట్టలను పునరుద్ధరించుకుంటే మంచిది.

## వైతాళికుల వాణి

అత్యంత బలహీనులు, అశక్తులైన ప్రజలను ఎలా చూస్తారనే దానిపైనే ఒక సమాజం పనితీరును అంచనా వేయగలం.

• **జిమ్మీ కార్టర్**
(అమెరికా 39వ అధ్యక్షుడు)

## క్యా సీన్ హై!

